క్లుప్తంగా

కేసు నమోదు

వాజేడు: మండల పరిధిలోని చీకుపల్లి గ్రామానికి చెందిన గొంది లింగమూర్తిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి నట్లు ఎస్సై ఎస్ రాజ్ కుమార్ గురువారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ధర్మవరం గ్రామానికి చెందిన గార శ్రీనివాసరావు చీకుపల్లి గ్రామం సమీపంలో అతడు సాగు చేసిన మిర్చి చేను వద్ద మంచ వేసుకుని పడుకున్నాడు. కాగా, గొంది లింగ మూర్తి హఠాత్తుగా గొడ్డలితో వచ్చి శ్రీనివాసరావు కాలు, మోచేతి భాగంపై దాడి చేసి గాయపర్చాడు. గార శ్రీనివాస రావు, గొంది లింగ మూర్తి ఇద్దరి భూములు పక్క పక్కనే ఉండటంతో ఇరు వర్గాలకు గతం నుంచి గొడవలు ఉన్నాయి. దానిని మనసులో పెట్టుకుని దాడి చేసి ఉంటాడని ఎస్సై తెలిపారు. శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు లింగమూర్తిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

అసిస్టెంట్ లైన్‌మెన్‌కు విద్యుత్ షాక్

ములుగు రూరల్: ట్రాన్స్‌ఫార్మర్ ఫీజు సరిచేస్తూ అసిస్టెంట్ లైన్‌మెన్ విద్యుత్ షాక్‌కు గురైన సంఘటన మండలంలోని జాకారంలో చోటు చేసుకుంది. తెలిసిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని అబ్బాపూర్ గ్రామానికి చెందిన రాస రమేశ్ విద్యుత్ అసిస్టెంట్ లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. జాకారం ఫీడర్‌లో సమస్య ఉందని ఫిర్యాదు రాగా ఎల్‌సీ తీసుకొని ట్రాన్స్‌ఫార్మర్ ఫీజు సరి చేస్తుండగా విద్యుత్ సరఫరా కావడంతో అక్కడ నుంచి కింద పడిపోయాడు. దీంతో రమేశ్ తొడ భాగంలో, మోచేతి భాగంలో కాలిపోయింది. అలాగే తలకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు రమేష్‌ను ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం వరంగల్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించినట్లు సమాచారం.

గుడుంబా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలి



ఏటూరునాగారం: గ్రామీణ ప్రాంతాలను గుడుంబా రహితంగా తీర్చిదిద్దడం కోసం యువత కృషి చేయాలని ఎస్సై తాజొద్దీన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని శివాలయం, ఓడగూడెం, బొడ్రాయి సెంటర్, తదితర ప్రాంతాలలో స్పెషల్ డాగ్‌తో గుడుంబా అమ్మకాలు జరిపే ఇళ్లపై తనిఖీలు చేశారు. గుడుంబా అమ్మకాలు నిర్వహించిన, తయారు చేసిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

గోవిందరావుపేట: మండల పరిధిలోని చల్వాయి మాడల్ స్కూల్ ప్రిన్సిపాల్ గండు కుమార్ ఆధ్వర్యంలో ఈ నెల 26న నిర్వహించే గణతంత్ర దినోత్సవం సందర్భంగా పాఠశాల విద్యార్థులకు ఆట పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని అన్నారు. అలాగే మండల స్థాయిలో ఓటరు దినోత్సవం సందర్భంగా రంగోలి కాంపిటీషన్ లో మోడల్ స్కూల్ విద్యార్థులు నిత్యాశ్రీ, శాలిని ప్రథమ స్థానం సాధించగా వారికి అభినందనలు తెలిపారు.

ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి



ములుగు రూరల్: వ్యవసాయ పనులు చేసుకుంటు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన పూజారి రజిత కుటుంబానికి ప్రభుత్వం రూ.30లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని జెడ్పీ మాజీ చైర్ పర్సన్ బడే నాగజ్యోతి అన్నారు. గురువారం జాకారం గ్రామంలో వేసి బాధిత కుటుంబాన్ని పరామర్శించి రజిత మృత దేహానికి పూలమాలలు నివాళులర్పించారు. ఆమె వెంట పార్టీ నాయకులు ఉన్నారు.

జేపీరావుకు ఘననివాళి



మంగపేట: మండలం కేంద్రంలోని బొడ్రాయి సెంటర్‌లో ఆదివాసీ ప్రజా సంఘాల నాయకులు ప్రొఫెసర్ జేపీరావు చిత్రపటానికి పూలమాలతో సత్కరించి గురువారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు ఆదివాసీ ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ.. ఆదివాసీల అభివృద్ధి కోసం నిరంతరం కృషిచేసిన జేపీరావు మృతితో ఆదివాసీ సమాజం పెద్ద దిక్కును కోల్పోయిందన్నారు. ఈ కార్యక్రమంలో మన్యసీమ పరిరక్షణ సమితి జోలిదెబ్బ రాష్ట్ర అధ్యక్షులు గొప్ప వీరయ్య, మండల అధ్యక్షుడు తాటి నాగరాజు, ఆదివాసీ సేన మండల అధ్యక్షుడు పోలెబోయిన ఆదినారాయణ, కొండా చెంచయ్య, జబ్బ రవి, పూనెం రాములు, తుడుందెబ్బ జిల్లా కార్యదర్శి అన్నెబోయిన సమ్మయ్య, చీమల నాగభూషణం, పొదెం మల్లికార్జున్, నల్లెబోయిన లక్ష్మన్ రావు తదితరులు పాల్గొన్నారు.

డీజిల్, పెట్రోల్ నోస్టాక్..



తాడ్వాయిలోని జీసీసీ పెట్రోల్, డీజిల్ బంక్

జీసీసీ బంక్‌లో పరిస్థితి
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

ఎస్ఎస్ తాడ్వాయి: మండల కేంద్రంలోని గిరిజన కార్పొరేషన్ సంస్థ (జీసీసీ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్‌లో పెట్రోల్, డీజిల్ కరువైంది. బంక్‌లో పెట్రోల్, డీజిల్ ఎప్పుడు ఉంటుందో.. ఎప్పుడో ఉండట్లేదో వాహనదారులు తెలియడం లేదు. కొద్దిరోజుల క్రితం వారం రోజులు పాటు డీజిల్, పెట్రోల్ లేకపోగా, ఇటీవల రెండు రోజుల క్రితం అమ్మకాలు నిర్వహించినప్పటికి మళ్లీ రెండు రోజుల నుంచి స్టాక్ లేదు. నాలుగైదు రోజులు పెట్రోల్, డీజిల్ లేకున్నా జీసీసీ అధికారులు పట్టించుకోవడం లేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. అమ్మకాల ద్వారా వాహనదారుల నుంచి తీసుకునే డబ్బులు ఏమవుతున్నాయో జీసీసీ అధికారులకే తెలియాల్సి ఉంది. అధికారులు ఇతర బంక్‌లను ఈ డబ్బులు వాడుతున్నారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాగా జిల్లా మొత్తంలో జీసీసీ ఆధ్వర్యంలో మొత్తం 5 బంక్‌లు నిర్వహిస్తున్నారు. తాడ్వాయి మండలంలోని గంగారం జీసీసీ బంక్ పరిస్థితి అధ్వాన్నంగా ఉంది. నెలలో కనీసం ఒకటి రెండు ట్రిప్పుల ఇంధనం ఎప్పుడు తెప్పించిన దాఖలాలు కనిపించడం లేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. బంక్‌కు ఎప్పుడు వెళ్లిన నో స్టాక్ బోర్డు దర్శనమిస్తుందని తెలిపారు. దీంతో డీజిల్, పెట్రోల్ కోసం ప్రైవేట్ వ్యాపారుల వద్దకు వెళ్లాల్సి వస్తుందని వాపోతున్నారు.

ఆన్‌లైన్ చెల్లింపులు లేక ఇబ్బందులు

బంక్‌లో ఆన్‌లైన్ చెల్లింపులు లేకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోజుల్లో ఎక్కడా చూసిన చిరువ్యాపారుల నుంచి మొదలుకొని అన్ని షాపుల్లో ఆన్‌లైన్ చెల్లింపులు జరుపుతుండగా ఈ బంక్‌లో మాత్రం కరువైంది. కొద్ది రోజుల పాటు ఆన్‌లైన్ చెల్లింపులు నిర్వహించగా అకౌంట్‌లో తేడాలు వస్తున్నాయనే కారణం సాకుతో ఆన్‌లైన్ చెల్లింపులు నిలిపివేశారు. మేడారం సమ్మక్క సారలమ్మలను దర్శించుకునేందుకు ఛత్తీస్‌గఢ్, భద్రచలం ప్రాంతాల నుంచి ఏటూరు నాగారం మీదుగా తాడ్వాయి నుంచి భక్తులు వాహనాల ద్వారా ప్రయాణిస్తుంటారు. బంక్‌లో పెట్రోల్, డీజిల్ పోయించుకునేందుకు వెళ్లే వాహనదారులకు ఆన్‌లైన్ చెల్లింపులు లేకపోవడంతో నానా తంటాలు పడుతున్నారు. నగదు డబ్బులు ఇస్తేనే పెట్రోల్ డీజిల్ పోస్తామని జీసీసీ సిబ్బంది చెప్పడం వాహనదారులు తప్పని పరిస్థితుల్లో నగదు కోసం పరిగెత్తాల్సి వస్తోంది. మేడారం మినీ జాతర సమీపిస్తుండటంతో వాహనాల తాకిడి ఎక్కువ ఉండే ఈ ప్రాంతంలో ఎల్లప్పుడు డీజిల్, పెట్రోల్ నిల్వ ఉంచడంతో పాటు ఆన్‌లైన్ చెల్లింపులు ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బంక్‌లో స్టాక్ ఉంచాలి



తాడ్వాయి జీసీసీ బంక్‌లో ఎప్పుడు డీజిల్, పెట్రోల్ స్టాక్ ఉంచాలి. నెలలో నాలుగు సార్లు డీజిల్, పెట్రోల్ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. ఇంధనం కోసం పస్రాకు 20 కిమీ, చిన్నబోయినపల్లికి 15 కి.మీ దూరంలోని ప్రైవేట్ బంక్‌లకు వెళ్లాల్సి వస్తుంది. వ్యవసాయ పనులకు ఇంధనం అవసరమై బంక్‌ల్లో స్టాక్ లేనప్పుడు ప్రైవేట్ వ్యాపారుల వద్ద బ్లాక్‌లో లీటర్‌కు రూ.20 నుంచి రూ.30 వరకు అదనంగా చెల్లించడంతో రైతుల పై వేలాది రూపాయల అదనపు భారం పడుతోంది.

– రాకూర్ అశోసింగ్, ఆటో యజమాని, తాడ్వాయి

నిధుల కొరత ఉంది

నిధుల కొరతతో బంక్‌లకు డీజిల్, పెట్రోల్ నిల్వ ఉండడం లేదు. జీసీసీ ఆధ్వర్యంలోని ఐదు బంకులను మెయింటనెన్స్ చేయాల్సి ఉంది. బంక్‌ల్లో డీజిల్, పెట్రోల్ స్టాక్ ఉండేలా చూస్తాం.

వాణి, జీసీసీ మేనేజర్, ఏటూరునాగారం

ప్రజాస్వామ్యానికి ఎన్నికలే మూలం

- ఎంఈఓ వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న ఎంఈఓ వెంకటేశ్వర్లు

వాజేడు: ప్రజాస్వామ్యానికి ఎన్నికలే మూలమని ఎంఈఓ తేజావత్ వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో గురువారం మాక్‌పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యానికి బలం ఎన్నికలని ప్రజాప్రతినిధులను ఎన్నిక విధానంలో ఎన్నుకుంటారన్నారు. మాక్ పోలింగ్ లో విద్యార్థులకు నోటిఫికేషన్ విడుదల, నామినేషన్ ప్రక్రియ, నామినేషన్ ఉప సంహరణ, పోలింగ్, ఎన్నికల ఫలితాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు స్వరూప్ సింగ్, మల్లయ్య, ఆనంద్, రవి, శ్రీకాంత్, కుమార్ బాబు, ప్రభాకర్, రాజేష్, వశ్య, అమ్మాజి రాణి తదితరులు ఉన్నారు.

విద్యుత్ తీగలు అమరిస్తే చర్యలు

- సీఐ బండారి కుమార్



వెంకటాపురం(కె): అవగాహన కల్పిస్తున్న సీఐ బండారి కుమార్

వెంకటాపురం(కె): అసాంఘిక శక్తులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వెంకటాపురం(కె) సీఐ బండారి కుమార్ సూచించారు. మండలంలోని శాంతినగర్ గ్రామంలో గురువారం కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో సమావేశం నిర్వహించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని అన్నారు. గ్రామస్తులు అటవీ జంతువుల వేటకు వెళ్లకూడదని, ఉచ్చులు, విద్యుత్ తీగలు అమర్చితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.సీఆర్‌పీఎఫ్, సివిల్ పోలీసులు పాల్గొన్నారు.

గోవిందరావుపేట: పంట పొలాల్లో, అడవుల్లో కరెంట్ తీగలు అమర్చి మనుషులకు ప్రమాదాలు కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని పస్రా ఎస్సై అచ్చ కమలాకర్ అన్నారు. మండల పరిధిలోని బుస్సాపూర్, దుంపెల్లిగూడెం గ్రామంలోని ప్రజలకు అవగాహన సమావేశాన్ని గురువారం ఎస్సై కమలాకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై కమలాకర్ మాట్లాడుతూ.. కొందరు వారి పంట పొలాలకు రక్షణకోసం, మరికొంత మంది వన్య ప్రాణులను వేటాడడం కోసం కరెంట్ తీగలు, ఉచ్చులు అమరుస్తున్నారని అన్నారు. దీంతో మనుషుల ప్రాణాలు పోయే ప్రమాదం ఉందని, గతంలో పస్రా పరిధిలో ఇటువంటి ఘటనలు జరిగినట్లు తెలిపారు.

వాజేడు: అడవి జంతువుల కోసం విద్యుత్ వైర్లను అమరిస్తే చట్ట పరంగా కఠిన చర్యలను తీసుకుంటామని పేరూరు ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని భువనపల్లి గ్రామంలో గురువారం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అడవి జంతువును వేటాడేందుకు, పంట చేలను కాపాడుకునే ఉద్దేశ్యంతో గాని విద్యుత్ వైర్లు అమర్చవద్దన్నారు.

రెచ్చగొట్టే మాటలతోనే ఆత్మహత్యాయత్నం

- కాంగ్రెస్ మండల ఇన్‌చార్జ్ రాంబాబు



మాట్లాడుతున్న జాడి రాంబాబు

కన్నాయిగూడెం: గ్రామ సభలో లబ్ధిదారుల జాబితాను అధికారులు చదువుతున్న క్రమంలో కుమ్మరి నాగేశ్వర్‌రావును ప్రతిపక్ష నాయకులు రెచ్చగొట్టే మాటలు చెప్పి పురుగుల మందు తాగాడానికి ప్రేరేపించారని కాంగ్రెస్ మండల ఇన్‌చార్జ్ రాంబాబు ఆరోపించారు. గురువారం మండలంలోని బుట్టాయిగూడెంలో నిర్వహించిన గ్రామ సభ వద్ద ఆయన మాట్లాడారు. కొంత మంది ప్రతీ పక్ష నాయకులు ప్రజాపాలనపై ఏర్పాటు చేసిన గ్రామ సభను తప్పుతోవా పట్టించాలని కావాలని గందరగోళం చేశారన్నారు. ఆ మాటలతో కుమ్మరి నాగేశ్వర్‌రావు అనే రైతు పురుగుల మందు తాగాడని తెలిపారు. కొంతమంది కావాలనే ఇలా చేశారని ఆరోపించారు.

ప్రభుత్వమే బాధ్యత వహించాలి

- బీఆర్ఎస్ నాయకుడు చిన్నికృష్ణ



మాట్లాడుతున్న చిన్నికృష్ణ

కన్నాయిగూడెం: ప్రభుత్వం మాయమాటలు చెప్పి రైతులను ఆత్మహత్య చేసుకునేలా ప్రేరపిస్తుందని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కావిరి చిన్నకృష్ణ అన్నారు. గురువారం గ్రామ శాఖ అధ్యక్షుడు సునార్కని సుధాకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మట్లాడారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాల అమలులో ప్రజలకు గందరగోళం ఉందన్నారు. బుట్టాయిగూడెంలో ఇందిరమ్మ ఇల్లు రాదనే ఆవేదనతో అధికారులను నిలదీసిన రైతు కుమ్మరి నాగేశ్వర్‌రావు ఆవేశంతో ముందు పురుగుల మందు తాగాడని ఆవేదన వ్యక్తం చేశారు. దినికి పూర్తి బాధ్యత ప్రభుత్వమే వహించాలన్నారు. కార్యక్రమంలో కావిరి పోషయ్య, రాజబాబు, సత్యం, రాజబాబు, సత్యం, రవీందర్, నర్సింహారావు, నాగార్జున్, శ్రీనువాస్ తితరులు పాల్గొన్నారు.

నాగేశ్వర్‌రావును రెచ్చగొట్టిన నాయకులు

- బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి జాడి రామరాజు



మాట్లాడుతున్న రామరాజు

కన్నాయిగూడెం: మండలంలోని బుట్టాయిగూడెంలో కుమ్మరి నాగేశ్వర్‌రావు పరుగుల మందు తాగేలా అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీ నాయకులు రెచ్చగొట్టే మాటలు మాట్లాడారని బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి జాడి రామరాజు ఆరోపించారు. గురువారం బీజేపీ మండల అధ్యక్షురాలు దుర్గం సమ్మక్క ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కుమ్మరి నాగేశ్వర్‌రావు గ్రామసభ వద్ద అధికారుల ముందే పురుగుల మందు తాగడం బాధకరమన్నారు. కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ బాధ్యత వహించాలని అన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

- ఎస్సై లక్ష్మారెడ్డి



క్రీడలను ప్రారంభిస్తున్న ఎస్సై లక్ష్మారెడ్డి

ములుగు రూరల్: క్రీడల్లో గెలుపోటములు సహజమని ఎస్సై లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో ఖేలో భారత్ క్రీడోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని అన్నారు. క్రీడలు విద్యార్థులకు శారీరక ధృడత్వం, క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తి, పోరాటపటిమలను నేర్పుతుందని అన్నారు. అనంతరం ఏబీవీపీ జిల్లా కన్వీనర్ మమన్‌యాదవ్ మాట్లాడుతూ.. స్వామి వివేకనంద, నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతి సందర్భంగా ఈ నెల 23 నుంచి 26 వరకు క్రీడలు నిర్వహిస్తున్నామని అన్నారు. క్రీడల్లో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాయిరాం శ్రీనాద్, జస్వంత్, ఫణీతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

ఎస్ఎస్‌తాడ్వాయి: మండల కేంద్రంలోని ఇందిరానగర్ గ్రామానికి చెందిన దివ్యాంగుడు ములుకుంట్ల రాజు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు పరామర్శించి రూ. 5వేల ఆర్థిక సాయం అందజేశారు. పీఏసీఎస్ మాజీ చైర్మన్ పాక సాంబయ్య, మేడారం ట్రస్ట్ బోర్డు చైర్మన్ లచ్చుపటేల్, మాజీ సర్పంచ్ ఇర్స సునీల్, సింగిల్ విండో డైరెక్టర్లు యానాల సిద్దిరెడ్డి, జగదీశ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు పాక రాజేందర్, నాయకులు అనుమాండ్ల రాజిరెడ్డి, ఆలేటి జైపాల్‌రెడ్డి, సంఘం రాము, గంట సాయిరెడ్డి పాల్గొన్నారు.



రొయ్యూర్‌లో గ్రామస్తుడిని ఆందోళన చెయొద్దని హెచ్చరిస్తున్న ఎస్సై



ఏటూరునాగారం:పేర్లు ఎందుకు రాలేదని అధికారులను ప్రశ్నిస్తున్న ప్రజలు



మంగపేట: దరఖాస్తు చేసుకుంటున్న లబ్ధిదారులు

రసాభాసగా గ్రామసభలు

సాక్షి నెట్‌వర్క్: ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాప్రాలన గ్రామసభలు చాలా చోట్లు గురువారం రసభాసగా జరిగాయి. లబ్ధిదారుల జాబితాను అధికారులు చదవి వినిపిస్తుండగా అర్హులైన వారి పేర్లు లబ్ధిదారుల జాబితాలో రాలేదని అనర్హుల పేర్లు వచ్చాయని అధికారులను గ్రామస్తులు నిలదీశారు. బీఆర్ఎస్, బీజేపీ నాయకులు, మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తు పెద్ద ఎత్తున గొడవకు దిగారు. ఇంటిపన్ను బకాయి చెల్లిస్తేనే ఇందిరమ్మ ఇల్లు సర్వే చేస్తామని అధికారులు చెప్పి బకాయి వసూలు చేశారని పంచాయతీ అధికారులపై ఇళ్ల మంజూరీలో పేర్లు రాని మహిళలు పలు చోట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు.



మంగపేట: అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు



ఏటూరునాగారం: మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి రాంపతి



వాజేడు: పేరూరులో..



వాజేడు:పెద్ద గొల్ల గూడెంలో ..

పేద ప్రజలపై భారం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

ఏటూరునాగారం: పేద, మధ్య తరగతి ప్రజలపై కేంద్ర ప్రభుత్వం ఆర్థిక భారం మోపుతోందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎండీ.దావూద్, మండల కార్యదర్శి చిటమట రమేశ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో సీపీఎం నాల్గొవ రాష్ట్ర మహాసభ పోస్టర్‌ను నాయకులు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఈనెల 25 నుంచి 28 వరకు సీపీఎం రాష్ట్ర 4వ మహాసభలు సంగారెడ్డి పట్టణంలో నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఈ మహాసభల్లో పేదలు, రైతులు, కూలీలు. అసంఘటిత కార్మికులు, నిరుద్యోగులు, ఉద్యోగులు, మధ్యతరగతి ప్రజలు, మహిళలు, యువజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు ఎండి యాకూబ్, బాలోజు రమేశ్, అంకుషావలి, వసంత నాగయ్య, నాయిని కృష్ణ, అంతటి సంజీవ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ చైతన్య ఉద్యమం

గోవిందరావుపేట: భారత రాజ్యాంగ చైతన్య ఉద్యమంకి నాంది పలకడానికి లక్ష ఉత్తరాలు రాసి సీఎం రేవంత్‌రెడ్డికి పంపిస్తామని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కరుణాకర్ అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కరుణాకర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం రిపబ్లిక్ డే రోజున ప్రతి జాతీయ జెండా వందనం వద్ద భారత రాజ్యాంగ పీఠికను ప్రతిజ్ఞ చేయించాలన్నారు. కృష్ణ, రవి తేజ, రాజు కుమార్, శ్రీకాంత్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా పథకాలు అందించాలి

ఏటూరునాగారం: ప్రభుత్వం పార్టీలకు అతీతంగా పథకాలను అందించాలని బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఖాజాపాషా అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ సభల పేరుతో ప్రజలను ఇబ్బంది పెట్టొద్దన్నారు. అర్హులైన వారికి పథకాలను ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. రాంనర్సయ్య, తాడూరి రఘు, కుమ్మరి చంద్రబాబు, గండెపల్లి నర్సయ్య, బట్టు రమేష్, కాళ్ల రామకృష్ణ, పాలకుర్తి విజయ్, తాళ్లపెల్లి మోహన్, దేపాక శ్రీరామ్, కిషోర్ పాల్గొన్నారు.

వీల్‌చైర్ అందజేత

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని వెంకటాపురం పోలీస్ సర్కిల్ కార్యాలయంలో సీఐ బండారి కుమార్ చేతుల మీదుగా శ్యామల శ్రీకాంత్ అనే యువకుడికి గురువారం వీల్‌చైర్ అందజేశారు. వాజేడు మండలం బోల్లారం గ్రామానికి చెందిన శ్యామల శ్రీకాంత్‌కు కొంత కాలం క్రితం రోడ్డు ప్రమాదంలో వెన్నుపూస విరిగి పోవటంతో కాళ్లు చేతులు పనిచేయకుండా పోయాయి. విషయం తెలుసుకున్న సీఐ బండారి కుమార్ వీల్ చైర్‌ను బచ్చు రవికుమార్ సహకారంతో అందజేశారు. ఈ కార్యక్రమంలో చేయూత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు సాయి ప్రకాశ్ , వనపర్తి రవీందర్, ఏఎస్సై రామ చంద్రు, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

నేతాజీని స్ఫూర్తిగా తీసుకోవాలి

ఏటూరునాగారం: నేతాజీ సుభాష్ చంద్రబోస్‌ను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఈట నవీన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నేతాజీ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు వెంకటయ్య, కనీస్ ఫాతిమా, జ్యోతి, రమేశ్, సంపత్, మున్ని, శేఖర్, భాస్కర్, జీవవేణి, సుమలత, భావన తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

ఏటూరునాగారం: మండలంలోని సాయిబాబా ఆలయంలో హైదరాబాద్ శంకర్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో గురువారం ఉచిత కంటి శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎస్సై తాజొదీన్ ప్రారంభించి మాట్లాడారు. ఉచిత కంటి వైద్య శిబిరంతో పేద ప్రజలకు లబ్ధి జరుగుతుందన్నారు. అనంతరం ప్రజలకు ఉచితంగా పెండ్యాల అకాశ్ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాయిబాబా ఆలయ చైర్మన్ పెండ్యాల ప్రభాకర్, నర్సింహచారి, వెంకట్రావు, శంకర్ ఐ ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.